క్లుప్తంగా

నేడు రాయవరం మండల పరిషత్ సమావేశం

రాయవరం: రాయవరం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తారు. ఈ విషయాన్ని ఎంపీడీవో డి.శ్రీనివాస్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రగతిని వివరించడంతో పాటు, సమస్యలపై కూడా చర్చిస్తామని తెలిపారు.

ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి జయంతి



అన్నదానంలో భోజనాలు చేస్తున్న భక్తులు

కె.గంగవరం: మండలంలోని తామరపల్లిలో కొలువైన ప్రసన్నాంజనేయ స్వామి జయంతిని మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా ఉదయం నుంచి ఆలయం వద్ద వేదపండితుల బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన చలగళ్ల సుబ్బారావు సహకారంతో ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానంలో గ్రామస్తులతో పాటు సత్యవాడ, కె.గంగవరం, ఊడిమూడి, సుందరపల్లి గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామ సర్పంచ్ తోకల మంగ, పార్టీ నాయకులు తోకల శ్రీను, ఉప సర్పంచ్ నెక్కింటి వీరభద్రరావు, పుల్లయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కాజులూరు: రాష్ట్రంలో రైతు సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. మండలంలోని ఆర్యావటం, కాజులూరు, బంధనపూడి గ్రామాల్లో మంగళవారం బుల్లిరాజు పర్యటించి రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆర్బీకేలు, పలు ఇతర కార్యక్రమాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయన్నారు. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకునేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు సక్రమంగా జరగాలని ఇబ్బందులు ఏమైనా ఏర్పడితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే సరిగా చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, కోలాని గణేశ్వరరావు, పోతురాజు బాబూరావు, లంక సురేష్ స్థానిక వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



రాయవరం పీహెచ్‌సీ వద్ద డెంగీ వ్యాధి నివారణపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

రాయవరం: డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎ.దేవి రాజశ్రీ, ఎం.శ్రీనివాస్ నేతృత్వంలో డెంగీపై అవగాహన ర్యాలీలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఆడ ఎడిస్ ఈజిప్ట్ దోమ కాటు వలన డెంగీ వ్యాధి వస్తుందన్నారు. పగటి పూట కుట్టే దోమల వలన మాత్రమే డెంగీ బారిన పడతామన్నారు. దోమ కుట్టిన ఐదు రోజుల నుంచి ఎనిమిది రోజులకు వ్యాధి లక్షణాలు బయట పడతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డి.కృష్ణశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ జె.శంకర్, మండపేట సబ్ యూనిట్ సబ్ డివిజనల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఏఎన్ఎం బుజ్జి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మండపేట: మండలంలోని ఏడిదలోని పేపర్ మిల్ వ్యర్థాలు వెళ్లే డ్రైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం రూరల్ పోలీసులు కనుగొన్నారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుంది. మృతుని శరీరంపై టవల్ మాత్రమే ఉండడంతో కార్మికుడై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతి చెంది రెండు రోజులు అయి ఉంటుందని, అధిక ఎండలు నేపథ్యంలో మృతదేహం గుర్తు పట్టలేని విధంగా డీ కంపోజ్ అయ్యిందని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ బి. శివకృష్ణ కోరారు.

18న ఉచిత కంటి వైద్య శిబిరం

పెదపూడి: పెదపూడిలో ఈ నెల 18న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులచౌదరి మంగళవారం తెలిపారు. 18 ఉదయం ఉద యం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

నిర్లక్ష్యం వద్దు... పశువుల సంరక్షణ ముద్దు

- అగ్ని ప్రమాదాల్లో తరచూ పశువుల మృతి
- పొలాల్లో గడ్డి తగలబెట్టడమూ ఓ కారణం
- రైతుల జాగ్రత్తలతో ప్రాణ రక్షణ
- రెండు నియోజకవర్గాల్లో రెండు అగ్నిమాపక కేంద్రాలు



2019 మే 17న వెదురుమూడి పశువులపాక దగ్ధమై చనిపోయిన పాడిపశువు (ఫైల్)

కపిలేశ్వరపురం: మూగ జీవాలను కాపాడుకునే బాధ్యతతో జీవించడం మానవ ధర్మం. తరచూ పశువుల పాకలు దగ్ధం కావడంతో పశువులు చనిపోతున్నాయి. అగ్నిమాపక దళ సిబ్బంది వచ్చేలోపే జీవాలు చనిపోతున్నాయి. రైతులంతా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. మండపేట, రామచంద్రపురం అగ్నిమాపక కేంద్రాల పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ ఏడాది వ్యవధిలో సుమారు 85 అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఆయా ప్రమాదాల్లో రూ.43.90 లక్షల నష్టం వాటిల్లింది.

వివిధ కారణాలతో ప్రమాదాలిలా...

- 2023 ఫిబ్రవరి 1న రాయవరం మండలం చెల్లూరు శివారు సూర్యారావుపేటలో ఒక గేదె చనిపోగా మరో రెండు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి.
- 2023 మార్చి 17న కె.గంగవరం మండలం కుందూరు శివారు కుందూరులంకలో పశువుల పాక దగ్ధం కావడంతో రెండు ఒంగోలు జాతి ఆవులు చనిపోయాయి.

పొలంలో గడ్డికి నిప్పు పెట్టడం వల్ల జరిగిన ప్రమాదాలిలా...

- 2020 మే 20న అంగరలో రెండు ఎకరాల ధాన్య పురాశి, మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి.
- 2020 మే 26న కపిలేశ్వరపురం మండలం టేకిలో రెండు పశువుల పాకలు తగలబడడంతో ఆరు పశువులు మృతి చెందాయి. 10 ఎకరాల్లోని గడ్డివామి దగ్ధమైంది. సుమారు రూ.ఐదు లక్షల ఆస్తినష్టం వాటిల్లింది.
- 2019 మే 16 రాయవరం చెల్లూరులో పశువుల పాక దగ్ధమై ఒక పాడి గేదె చనిపోయింది.
- 2019 మే 17న కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామ శివారు తాళ్లపాలెం పుంత ఓఎన్‌జీసీ వద్ద గ్రామంలో పశువుల పాక దగ్ధమై రెండు గేదె దూడలు మృత్యువాత పడ్డాయి. మరో రెండు పాడి గేదెలకు 50 శాతం గాయాలయ్యాయి. ఒక గేదె స్వల్ప గాయాలతో బయట పడింది. 2.40 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది.
- 2018 మే 5న రాయవరం మండలం వెదురుపాకలో సంభవించిన ప్రమాదంలో 12 ఎకరాల్లోని ధాన్యం రాశులు అగ్నికి ఆహుతయ్యాయి.

రెండు నియోజకవరాల్లో అగ్నిమాపక కేంద్రాలిలా..

మండపేట, కపిలేశ్వరపురం మండలాలు పూర్తిగానూ, రాయవరం, ఆలమూరు మండలాల్లోని కొన్ని గ్రామాలకు మండపేట అగ్నిమాపక కేంద్రం ద్వారా సేవలందుతున్నాయి. రామచంద్రపురం, కె.గంగవరం మండలాలతోపాటు తాళ్లరేవు, కాజులూరు, రాయవరం, పెదపూడి, కరప మండలాల్లోని కొన్ని గ్రామాలకు రామచంద్రపురం అగ్నిమాపక కేంద్రం ద్వారా సేవలందుతున్నాయి.

అగ్నిమాపక దళ సిబ్బందికి ఇబ్బందులు ఇలా...

వ్యవసాయ క్షేత్రంలో మంటలను ఆర్పడం అగ్నిమాపక దళ సిబ్బందికి ఎంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. విశాలమైన వ్యవసాయ క్షేత్రంలో నిప్పు రాజుకోగానే క్షణాల్లో ప్రమాద తీవ్రత పెరిగిపోతుంది. ప్రమాద ఘటనా స్థలం వ్యవసాయ క్షేత్రం కావడంతో వాహనం నుంచి దూరంగా నీళ్లను చల్లడం సమస్యతో కూడుకున్నది. ఒకే సమయంలో రెండు చోట్ల ప్రమాదాలు సంభవించినప్పుడు సిబ్బందికి ఏమీ పాలుపోని పరిస్థితి తలెత్తుతుంది.

ఎండు గడ్డిని ఎరువుగా వాడుకోవాలి



పొలంలోని గడ్డిని కుళ్లబెట్టి దమ్ము చేస్తే ఎరువుగా మారుతుంది. పొలంలోని గడ్డిని తగలబెట్టడ నష్టదాయకమే కాకుండా ప్రమాదకరం కూడా. పర్యావరణం దెబ్బతినడంతోపాటు సాగుకు ఉపకరించే సూక్ష్మ జీవులు చనిపోతాయి. గడ్డిని తగలబెట్టాలన్న ఆలోచనను రైతులు విడనాడాలి.

కేవీఎస్ రమేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, కపిలేశ్వరపురం

సంక్షేమంతో పేదలకు మేలు

- కపిలేశ్వరపురం మండల సమావేశంలో వక్తలు
- పలు అంశాలపై సమావేశంలో చర్చ



కపిలేశ్వరపురం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు కలుగుతుందని కపిలేశ్వరపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న వక్తలన్నారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అజెండాను వివరించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, తహసీల్దార్ కొమరం సూర్యారావు అంశాల వారీ చర్చలో పాల్గొన్నారు. రైతు భరోసా పథకంలో లబ్ధి పొందేందుకు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు రైతులకు ఈ నెల 18 వరకూ గడువు పెంచినట్టు ఏవో కేవీఎస్‌రమేష్‌కుమార్ తెలిపారు. ధాన్యం కొనుగోలు వివరాలను తెలపాలని ఎమ్మెల్యే వేగుళ్ల అడిగారు. క్షేత్ర స్థాయిలోని ఆర్బీకేల ద్వారా 4,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించామని ఏఓ తెలిపారు. మరో 1,800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆఫ్ లైన్లో రైతులు విక్రయించుకున్నారన్నారు. మాచరలో నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫలితాలు మెరుగ్గా లేకపోవడంపై ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రస్తావించారు. అనుభవం ఉన్న అధ్యాపకుల నియామకం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, లేని పక్షంలో విద్యార్థుల భవిష్యత్ దెబ్బ తింటుందని ఎమ్మెల్యే అన్నారు. విద్యుత్, ఉద్యాన, ఇరిగేషన్, రెవెన్యూ, ఐసీడీఎస్, ఆరోగ్య శాఖల పరిధిలోని సమస్యలపై చర్చించారు. నూతనంగా ఎన్నికైన మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తొలిసారిగా సర్వసభ్య సమావేశానికి హాజరైన నేపథ్యంలో సభ్యులు ఘనంగా సత్కరించారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

పొలాల్లో మంట పెడుతున్నారు



మండపేటలోని పొలాల్లో ఎగసిపడుతున్న మంటలు

మండపేట: అసలే భానుడి భగభగలు.. ఆపై మంటలు. వాతావరణాన్ని మరింత అగ్నిగుండం చేస్తున్నాయి. పొలాల్లోని గడ్డికి నిప్పు పెడుతుండడంతో ఎగసి పడుతున్న మంటలతో వాతావరణం మరింత వేడెక్కిపోతోంది. దాళ్వా వరి కోతలకు మెజారిటీ మంది రైతులు వరికోత యంత్రాలనే వినియోగించారు. ఈ గడ్డి పాడి పశువులకు మేతగా పనిచేయక పోవడంతో పొలాల్లోనే వదిలివేసి మంట పెడుతున్నారు. ప్రస్తుత ఎండల తీవ్రతకు తోడు ఈ మంటలు మరింత ఆజ్యం పోసినట్టువుతున్నాయి. వేడిగాలులతో సమీపంలోని ప్రజలు, రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. మంటలు ఒక పొలం మీదుగా మరొక పొలానికి వ్యాపిస్తూ ధాన్యపు రాశులతో పాటు పొలాల్లో దిమ్మలపై ఉంచిన గడ్డివాములు నిప్పంటుకుని బూడిదవుతున్నాయి. పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టకుండా దమ్ములో కలియదున్నేలా రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మందుబాబుల ఆగడాలు



మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పై అంతస్తులో ఇలా..

మండపేట: మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గల మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయి. దాంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. మద్యం బాటిల్స్, తినిపారేసిన వ్యర్థాలతో మెట్లపై పారిశుధ్యం లోపిస్తోంది. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులను పలువురు వేలంలో పాడుకుని రకరకాల వ్యాపారాలు చేసుకుంటున్నారు. కాగా రాత్రయ్యే సరికి షాపింగ్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులోకి వెళ్లే మెట్లపై మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. ఖాళీ మద్యం బాటిళ్లు, తినిపారేసిన ఆహార వ్యర్థాలను మెట్లపై చిందర వందరగా పడేస్తున్నారు. అక్కడే మూత్ర విసర్జన చేస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు. ఉదయం వచ్చే సరికి మెట్లు వ్యర్థాలతో ఉండటంతో తమ షాపుల్లోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, పోలీసులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి



కె.శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రామచంద్రపురం

రామచంద్రపురం: పట్టణంలోని 14వ వార్డు చప్పిడివారి సావరంలో గల 7వ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీసైకిల్) సెంటర్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సెంటర్ ఈ నెల 16 నుంచి జూన్ 5 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, చెప్పులు, టోపీలు, పరుపులు, బెడ్‌షీట్లు, దుప్పట్లు, పుస్తకాలు, బ్యాగ్‌లు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, సైకిళ్లు, చెక్క కుర్చీలు, ఇనుప కుర్చీలు, టేబుల్స్, చెక్క మంచాలు, ఇనుప మంచాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితర వస్తువులను ఈ సెంటర్‌కు అందిస్తే, వారు వాటి అవసరం ఉన్న ఇతరులకు వాటిని అందజేస్తారని తెలిపారు. ఈ సెంటర్‌కు నిరుపయోగంగా ఉన్న వస్తువులు ఇవ్వదలచిన వారు తమ ఏరియాలోని శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీకి సమాచారం ఇవ్వాలని సూచించారు. వారు ఆయా వస్తువులను ఆర్ఆర్ఆర్ సెంటరుకు తరలిస్తారని తెలిపారు. మనకు పనికిరాకుండా ఉండి, ఇతరులకు ఉపయోగపడే వస్తువులను వారికి అందించి సహాయపడే విధంగా అవకాశం కల్పిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సేవలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

యానాం: ఎమ్మెల్యే ల్యాడ్, పీడబ్ల్యూడీ తదితర నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఆర్ఏఓ మునిస్వామి సమక్షంలో పీడబ్ల్యూడీ ఈఈ సుందరేషన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు మంజూరైనా కనకాలపేట పరిధిలోని గాయత్రినగర్‌లో రహదారి పనులు ప్రారంభించలేదన్నారు. తోటవారివీధిలో నూతన డ్రెయినేజీ పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్, టెండర్ ప్రక్రియ పూర్తయినా పనులు మొదలు పెట్టలేదన్నారు. గోపాల్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో చెత్తను సేంద్రియ ఎరువులుగా మార్చే కేంద్రం నిర్మాణ పనులు సైతం చేపట్టాలన్నారు. వర్షాకాలం రాకముందే డ్రెయిన్లు, రహదారుల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. గత సీఆర్‌జెడ్ నిబంధనల వల్ల గోదావరిని ఆనుకుని ఉన్న ఫెర్రీ రోడ్డు ప్రాంత పరిధిలో రహదారులు వేయడానికి అనుమతులు లేవని అధికారులు చెబుతున్నారన్నారు. కాని ఇటీవల కొత్తగా జరిగిన కోస్టల్ రెగ్యులేటరీ జోన్ అథారిటీ సమావేశంలో 50 మీటర్లలోపు నిర్మాణాలు చేసుకోవచ్చునని తెలిపారన్నారు. రమాబాయినగర్, మెట్టకూరు ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని ఆర్ఏఓ మునిస్వామిని కోరారు.

రవివార్ ..



రోడ్డు పక్కన గొడుగులు వేసుకుని వ్యాపారాలు చేస్తున్న చిరు వర్తకులు

చిరు వ్యాపారులపై సూర్య ప్రతాపం

రాయవరం: వ్యాపారం చెయ్యకుంటే పూట గడవని పరిస్థితి వారిది. చేద్దామంటే తట్టుకోలేనంతగా ఎండ అల్లాడిస్తోంది. కొందరు ఉదయం 11 గంటలకే దుకాణాలు మూసి వేసి సాయంత్రం ఐదు గంటల వరకూ తెరవని పరిస్థితి ఎక్కడికక్కడ నెలకొంటోంది. మరికొందరు విధిలేని పరిస్థితుల్లో ఎండ వేడిలోనే ఏదో ఒక నీడ ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిల్లర వ్యాపారాలు చేసేవారు ఎక్కువే. రహదారికి ఇరువైపులా అమ్మకాలు చేసే వ్యాపారులు కొనేవారు వచ్చినా, రాకపోయినా రహదారి పక్కనే కూర్చుంటారు. ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు గొడుగులు వేసుకుని కొందరు వ్యాపారాలు చేస్తుంటే, మరికొందరు చెట్ల నీడన వ్యాపారాలు చేస్తున్నారు. సైకిళ్లపై సీజనల్ వ్యాపారాలు చేసే వారి పరిస్థితి చెప్పనలవి కాకుండా ఉంది.

కొనసాగుతున్న నిప్పుల వర్షం

సూరీడు తన చండ ప్రచండాన్ని కొనసాగిస్తున్నాడు. భానుడు ఉదయం ఏడు గంటల నుంచే తన ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాడు. వారం రోజులుగా 40 డిగ్రీల నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జనం రోడ్డు మీదకు వచ్చేందుకు వెనుకంజ వేస్తుండడంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఎండ వేడికి సతమతం అవుతున్నారు. ఎండ వేడి నుంచి రక్షణ పొందేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఎండ వేడిమితో పాటు ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.ముఖ్యంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు బాధలు చెప్పనలవి కాకుండా ఉంది. జూన్ దగ్గర పడడంతో నైరుతి రుతు పవనాలు ఎప్పుడు వస్తాయా..పూర్తి స్థాయిలో వాతావరణం ఎప్పుడు చల్లబడుతుందా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

విజృంభిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా మారిన పామర్రు ప్రధాన రహదారి

కె.గంగవరం: ఈ నెల మొదటి వారం నుంచి ఎండలు విజృంభించడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గత రెండు రోజులుగా నియోజకవర్గంలో అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం ఇళ్లకే పరిమితం అవుతున్నారు. దీంతో పలు గ్రామాల్లో జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు విజృంభించడంతో బయటకు రావాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. దీనికి తోడు కాలువలు కట్టేయడం వల్ల ఎండ వేడికి పల్లెలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. వడగాడ్పులతో గోదావరి తీర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఎండ వేడిమికి తట్టుకోలేక అపసోపాలు పడుతున్నారు. ఎండ తాపం నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలపై ఆధారపడుతున్నారు. కూల్‌డ్రింక్ షాపులు, శీతలపానీయాల దుకాణాలు, జ్యూస్ సెంటర్లు, కొబ్బరి బొండాల వద్ద జనం బారులు తీరుతున్నారు.

మండుటెండకు నిండు ముసుగు

మండుటెండలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో ప్రయాణం సాగించక తప్పడం లేదు. ఉపాధి, శుభకార్యాలు, ఇతర అవసరాలు నిమిత్తం వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. నిండా ముసుగుతో కన్పించిన దృశ్యాలు మండుటెండల ప్రభావాన్ని చెప్పకనే చెబుతున్నాయి.

-రాయవరం







బాలుడి చికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.2.50 లక్షలు



బాలుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని పడమర ఖండ్రిక గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు కరుప్రోలు జ్ఞానేంద్ర సాయికృష్ణ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.50 లక్షలు మంజూరైంది. బాధిత బాలుడు తండ్రి వెంకన్నబాబుకు సాయం మంజూరు పత్రాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. దీర్ఘకాలంగా బాలుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని ప్రస్తుతం కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తండ్రి వెంకన్నబాబు తెలిపారు. తన కుటుంబం పడుతున్న బాధను తెలుసుకుని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మానవత్వంతో సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించారని కృతజ్ఞతలు తెలిపారు.

పశు గణాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

ఆలమూరు: మేలు జాతి పశుగణాభివృద్ధికి రైతులందరూ తమ వంతు తోడ్పాటును అందించాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ అన్నారు. మేలు జాతి మగ దూడలను పరీక్షలు నిర్వహించేందుకు మండలంలోని గుమ్మిలేరుకు మంగళవారం ఆయన వచ్చారు. మేలు జాతి ముర్రా జాతి దూడలను గుర్తించి వాటికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధులు లేని దూడలను గుర్తించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఏడీలు ఒ.రామకృష్ణ, ఎల్.అనిత, పశువైద్యాధికారులు నిఖిల్ వర్మ, సుభాష్‌చంద్ర, భావన తదితరులు పాల్గొన్నారు.

యానాంలో ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీ

యానాం: పట్టణ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వ్యాపార సంస్థలు నిషేధించాలని కోరుతూ మంగళవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పురవీధుల్లో ర్యాలీ మంగళవారం నిర్వహించారు. స్థానిక ఆర్ఏఓ కార్యాలయం వద్ద ఆర్ఏఓ మునిస్వామి జెండా ఊపి విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలగడమే కాకుండా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వివిధ వ్యాపార సంస్థల యాజమాన్యాలు ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేసి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్, ఎస్‌ఐ శేరు నూకరాజు, డిప్యూటీ తహసీల్దార్ గణేషన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

యానాం: యానాం బైపాస్ సెంటర్‌లో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందాడని ఎస్‌ఐ శేరు నూకరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బైపాస్ రహదారి పరిధిలోని న్యూగోపీకృష్ణా బార్ సమీపంలో సుమారు 55 సంవత్సరాల వ్యక్తి మృతదేహం కనిపించిందన్నారు. వడగాల్పులకు గురై లేదా అనారోగ్యంతో అతడు మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని యానాం మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు యానాం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ముగిసిన హనుమజ్జయంతి

ఆలమూరు: స్థానిక బస్టాండు సెంటర్‌లో వేంచేసిన ఆంజనేయస్వామి ఆలయంలో జయంతి ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈనెల 15న హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా ప్రారంభించిన ఈ ఉత్సవాలను వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు ఐదువేల మందికి పిండివంటలతో భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి.

సాంకేతిక సమస్యలను అధిగమించాలి

సామర్లకోట: మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో సాంకేతిక సమస్యలను శిక్షణతో అధిగమించాలని జిల్లా రిసోర్సు పర్సన్ ఎల్.జయరాజ్ అన్నారు. స్థానిక సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రం (టీటీడీసీ)లో మెప్మాలోని సామర్లకోట మున్సిపాలిటీ రిసోర్సు పర్సన్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ మంగళవారం ముగిసింది. మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాల అమలుపై ఆర్పీలకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని ప్రతీ మహిళా సంఘం తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకునే విధంగా చేయాలన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత శిక్షణ ఇచ్చారు.

మహాయాగానికి తరలిన భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాల త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం నుంచి మంగళవారం శ్రీలక్ష్మీ మహాయజ్ఞాన్ని తిలకించడానికి బస్సు బయలు దేరింది. రాష్ట్ర దేవదాయశాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న యాగాన్ని తిలకించేందుకు భక్తుల కోసం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉచిత బస్సు ఏర్పాటు చేయగా, ఆ బస్సు యాత్రను పంచారామ క్షేత్రం వద్ద ఈఓ డి నాగమల్లేశ్వరరావు ప్రారంభించారు. భక్తులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలను దేవదాయశాఖ ఏర్పాటు చేసిందని ఈఓ తెలిపారు.